# ఆశీర్వదించండి.. అభివృద్ధి చేసుకుందాం



వీణవంకలో బీఆర్ఎస్‌లో చేరిన ఘన్ముక్లకు చెందిన ముదిరాజ్‌లతో మండలి విప్ కౌశిక్‌రెడ్డి

- హనుమాన్ గుడిలేని ఊరు.. కేసీఆర్ సంక్షేమ పథకాలు అందని గడపలేదు
- బీఆర్ఎస్ హుజూరాబాద్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి

వీణవంక, అక్టోబర్ 13: తెలంగాణ రాష్ట్రం ఏర్పడ్డాక సీఎం కేసీఆర్ నాయకత్వంలో ఊరూ, వాడ ఎంత అభివృద్ధి జరిగిందో ఒక్కసారి ఆలోచన చేయాలని మండలి విప్, హుజూరాబాద్ బీఆర్ఎస్ ఎమ్మెల్యే అభ్యర్థి పాడి కౌశిక్‌రెడ్డి ప్రజలను కోరారు. మండలంలోని రెడ్డిపల్లి, శ్రీరాములపేట, కొండపాక, పోతిరెడ్డిపల్లి, హిమ్మత్‌నగర్ గ్రామాల్లో శుక్రవారం ఏర్పాటు చేసిన బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తల సమావేశాలకు స్థానిక ప్రజాప్రతినిధులతో కలిసి ఆయన హాజరయ్యారు. ఈ సందర్భంగా ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డి మాట్లాడుతూ, అధికారదాహంతో ఎన్నికలకు పగటి వేషగాళ్లు వస్తారని, వారిని నమ్మి మోసపోవద్దని సూచించారు. తెలంగాణ రాష్ట్రంలో ఎవరు అవునన్నా.. కాదన్నా మూడో సారి కేసీఆరే సీఎం అవుతారని, అభివృద్ధి ప్రదాతకు అండగా ఉండాలని కోరారు. ఏడు సార్లు గెలిపించినా ఈటల రాజేందర్ ఎమ్మెల్యేగా నియోజకవర్గాన్ని ఏ మాత్రం అభివృద్ధి చేయలేదని విమర్శించారు. ఒక్కసారి తనను ఆశీర్వదిస్తే రూ.వెయ్యి కోట్ల నిధులు తెచ్చి ప్రతి గ్రామాన్ని అభివృద్ధి చేసుకుందామన్నారు. తెలంగాణ రాష్ట్రంలో హనుమాన్ గుడిలేని ఊరు.. సీఎం కేసీఆర్ సంక్షేమ పథకాలు అందని గడప లేదని పేర్కొన్నారు. ప్రతి కార్యకర్త బాధ్యతతో పని చేయాలని, వచ్చే ఎన్నికల్లో గులాబీజెండా ఎగురవేయడానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు.

### బతుకమ్మ చీరల్లో ప్రజాప్రతినిధులు, మహిళలు

హిమ్మత్‌నగర్ గ్రామంలో మహిళా ప్రజాప్రతినిధులు సర్పంచ్ అంగిడి రాధ, ఎంపీటీసీ నల్ల మమత, మరో 10 మంది మహిళలు బతుకమ్మ చీరలు ధరించి మండలి విప్, ఎమ్మెల్సీ పాడి కౌశిక్‌రెడ్డిని ప్రత్యేకంగా కలిశారు. సీఎం కేసీఆర్ అందించిన బతుకమ్మ చీరలు మంచి డిజైన్లలో, అందంగా ఉన్నాయని సంతోషం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, జడ్పీటీసీ మాడ వనమాల-సాధవరెడ్డి, సింగిల్‌విండో మాజీ చైర్మన్ గంగాడి తిరుపతిరెడ్డి, సర్పంచులు పోతుల నర్సయ్య, ఆవాల అరుంధతి-గిరిబాబు, అంగిడి రాధ, ఎంపీటీసీలు ఒడ్డెపెల్లి లక్ష్మి-భూమయ్య, నల్ల మమత-తిరుపతిరెడ్డి, సంగ స్వరూప-సమ్మయ్య, సింగిల్‌విండో డైరెక్టర్లు చెక్క బండి శ్రీనివాస్‌రెడ్డి, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షులు ఇట్టవేన రాజయ్య, నల్ల రవీందర్‌రెడ్డి, తిప్పని ప్రశాంత్, ఈదునూరి భూమయ్య, సీనియర్ నాయకులు పరిపాటి రవీందర్‌రెడ్డి, అడిగొప్పుల సత్యనారాయణ, కామిడి శ్రీనివాస్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, మ్యాక సమ్మయ్య, నందిపాట రమేశ్, చింతల సుమన్, పోతుల సురేశ్, గట్టు మధు, బుచ్చయ్య, సంపత్, మ్యాడగోని తిరుపతి, బొబ్బల సమ్మిరెడ్డి, దాసారపు కృష్ణచైతన్య, బీఆర్ఎస్ ముఖ్య కార్యకర్తలు పాల్గొన్నారు.

### బీఆర్ఎస్‌లో చేరికలు

వీణవంక, అక్టోబర్ 13: మండల కేంద్రంలోని మండలి విప్ నివాసంలో శుక్రవారం ఘన్ముక్ల గ్రామానికి చెందిన 70 మంది ముదిరాజ్‌లు, 30 మంది ఒడ్డెర కులస్తులు బీజేపీ నుంచి బీఆర్ఎస్‌లో చేరారు. వారికి మండలి విప్ పాడి కౌశిక్‌రెడ్డి గులాబీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. కార్యక్రమంలో ఎంపీపీ ముసిపట్ల రేణుక-తిరుపతిరెడ్డి, ఘన్ముక్ల సర్పంచ్ జున్నుతుల సునీత-మల్లారెడ్డి, ఉప సర్పంచ్ తాడిచెర్ల కొమురయ్య, వార్డు మెంబర్ వీణవంక మల్లయ్య, బీఆర్ఎస్ గ్రామాధ్యక్షుడు రాజిరెడ్డి, నాయకులు నాగిడి అనిల్, కొండల్‌రెడ్డి, రమణారెడ్డి, ముదిరాజ్, ఒడ్డెర కుల సంఘాల నాయకులు, మహిళలు, తదితరులు పాల్గొన్నారు.

## సాగు వివరాల నమోదుకు రైతులు సహకరించాలి

- జమ్మికుంట పర్యటనలో జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్



ధాన్యం కొనుగోళ్లను పరిశీలిస్తున్న డీఏవో

జమ్మికుంట, అక్టోబర్ 13: సాగు వివరాల నమోదు కోసం వచ్చిన ఏఈవోలకు రైతులందరూ సహకరించాలని, పంటల వివరాలు నమోదు చేయించుకోవాలని జిల్లా వ్యవసాయ అధికారి శ్రీధర్ సూచించారు. శుక్రవారం ఆయన జమ్మికుంట మండలంలోని మాచినపల్లి, పెద్దంపల్లి, మున్సిపల్ పరిధిలోని కేశవాపూర్, మోత్కులగూడెంలో పర్యటించారు. రైతుల వద్దకు వెళ్లారు. క్షేత్రస్థాయిలో ఏఈవోలతో కలిసి పంటల వివరాలు సేకరించారు. ఫొటోలు తీసి, సాగు వివరాల లెక్కలను అప్‌లోడ్ చేశారు. పలు గ్రామాల్లో రైతుల వరి కోతలను పరిశీలించారు. ధాన్యం అమ్ముకుంటున్న రైతులతో మాట్లాడారు. పచ్చి ధాన్యాన్ని అమ్ముతున్న విషయాన్ని గుర్తించారు. తక్కువ ధరలకు పచ్చి ధాన్యాన్ని అమ్మవద్దని సూచించారు. తర్వాత ఆయన రైతులనుద్దేశించి మాట్లాడారు. పంటల వివరాల కచ్చితత్వం కోసం ప్రభుత్వం ఏఈవో యాప్‌ను అందుబాటులోకి తెచ్చిందని, జిల్లాలో జమ్మికుంటను పైలెట్ ప్రాజెక్టు కింద ఎంపిక చేశామని చెప్పారు. జమ్మికుంట మండలంలో 22వేల ఎకరాల్లో పలు రకాల పంటలను రైతులు సాగు చేస్తున్నారని, ఇప్పటికే 10వేలకు పైగా ఎకరాల పంట వివరాలను ఆన్‌లైన్‌లో నమోదు చేశామని తెలిపారు. ప్రభుత్వం ధాన్యానికి మద్దతు ధర చెల్లిస్తున్నదని, ఆరబెట్టిన ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల్లోనే అమ్ముకోవాలని విజ్ఞప్తి చేశారు. పచ్చి ధాన్యం క్రయ, విక్రయాలపై ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్తానని చెప్పారు. ఆయన వెంట ఏవో గోవర్ధన్‌రెడ్డి, ఏఈవో లక్ష్మణ్, రైతులు, సిబ్బంది ఉన్నారు.

## సీఏతో ఉజ్వల భవిష్యత్తు



బతుకమ్మలతో ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు, విద్యార్థులు

జమ్మికుంట, అక్టోబర్ 13: చార్టెడ్ అకౌంటెంట్ విద్యతో విద్యార్థులకు ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని, సీఏతో ఉద్యోగ, ఉపాధి అవకాశాల్లో రాణించవచ్చని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్, చార్టెడ్ అకౌంటెంట్ ఆఫ్ ఇండియా సంస్థ కరీంనగర్ శాఖ ప్రతినిధి కల్పన తెలిపారు. శుక్రవారం పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాల సమావేశ మందిరంలో డిపార్ట్‌మెంట్ ఆఫ్ కామర్స్, కెరీర్ గైడెన్స్ సెల్ ఆధ్వర్యంలో సీఏపై అవగాహన సదస్సును ఏర్పాటు చేయగా, ముఖ్య అతిథులుగా వారు హాజరై మాట్లాడారు. కోర్సును క్రమశిక్షణ, పట్టుదలతో చదివితే సులభంగా పూర్తి చేయవచ్చని తెలిపారు. సీఏ కోర్సుకు దేశవ్యాప్తంగా మంచి డిమాండ్ ఉందని చెప్పారు. తర్వాత కోర్సు కాల వ్యవధి, ఖర్చు, కోర్సు పూర్తి చేసిన తర్వాత కెరీర్, తదితర అంశాలను వివరించారు. విద్యార్థుల సందేహాలను నివృత్తి చేశారు. ఇక్కడ అధ్యాపకులు మహేందర్‌రావు, శ్రీనివాస్‌రెడ్డి, భీమారావు, ఈశ్వరయ్య, స్వరూపారాణి, ప్రశాంత్, శ్రీకాంత్, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### డిగ్రీ, పీజీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలు

పట్టణంలోని ప్రభుత్వ డిగ్రీ, పీజీ కళాశాలలో ముందస్తు బతుకమ్మ వేడుకలను ఎన్ఎస్ఎస్, ఉమెన్ ఎంపవర్‌మెంట్ సెల్ ఆధ్వర్యంలో శుక్రవారం ఘనంగా నిర్వహించారు. విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మను పేర్చారు. ఆట, పాటలతో అలరించారు. తర్వాత నిమజ్జనం చేశారు. వేడుకల్లో ప్రిన్సిపాల్ డాక్టర్ రాజశేఖర్‌తో పాటు అధ్యాపకులు సువర్ణ, శ్రీలత, స్వరూపారాణి, మమత, సుష్మ, అనూష, విద్యార్థులు, తదితరులు పాల్గొన్నారు.

### సింగాపూర్, తుమ్మనపల్లిలో..



సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాలలో సంబురాల్లో పాల్గొన్న విద్యార్థినులు, అధ్యాపకులు

హుజూరాబాద్ రూరల్, అక్టోబర్13: మండలంలోని సింగాపూర్ వీఎస్ఆర్ డిగ్రీ కళాశాల, తుమ్మనపల్లిలోని ఏకశిల పాఠశాలలో శుక్రవారం ముందస్తు బతుకమ్మ సంబురాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా విద్యార్థినులు తీరొక్క పూలతో బతుకమ్మలు పేర్చారు. విద్యాలయాల ఆవరణలో బతుకమ్మ పాటలతో ఆడిపాడారు. కోలాటాలతో సందడి చేశారు. అనంతరం ఒకరికొకరు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు. ఆయా వేడుకల్లో మహిళా ఉపాధ్యాయులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

## ఉచిత చేప పిల్లల పంపిణీ



వీణవంకలో ఉచిత చేప పిల్లలను మత్స్యకారులకు అందజేస్తున్న ఎఫ్‌డీవో

వీణవంక, అక్టోబర్ 13: జిల్లా మత్స్య పారిశ్రామిక సహకార సంఘం ఆధ్వర్యంలో శుక్రవారం మండలంలోని రెడ్డిపల్లి, వీణవంక, కనపర్తి, నర్సింగాపూర్, రామకృష్ణాపూర్ గ్రామాల్లో రూ.18 లక్షల విలువైన 13 లక్షల చేప పిల్లలను మత్స్యకారులకు ఉచితంగా పంపిణీ చేసినట్లు కరీంనగర్ ఎఫ్‌డీవో కిరణ్‌కుమార్ తెలిపారు. కార్యక్రమంలో ఎఫ్ఎఫ్‌వో అశోక్, వీణవంక మత్స్య పారిశ్రామిక సహకార సంఘం అధ్యక్షుడు మోటం వెంకటేశ్, కార్యదర్శి కుమార్, డైరెక్టర్లు రవీందర్, రవి, రాము, సంపత్‌కుమార్, స్వామి, ఓదెలు, సభ్యులు రాయిశెట్టి సంపత్, సదానందం, రాములు, మొగిలి, రాజు, నారాయణ తదితరులు పాల్గొన్నారు.

## 'విస్‌డమ్' విద్యార్థుల హంగామా

జమ్మికుంట, అక్టోబర్ 13: పట్టణంలోని విస్‌డమ్ జూనియర్ కాలేజీ విద్యార్థులు స్థానిక సువర్ణ ఫంక్షన్ హాల్‌లో కాలేజ్ డే వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఆటపాటలు, సాంస్కృతిక కార్యక్రమాలతో హంగామా చేశారు. అనంతరం కాలేజీ ప్రిన్సిపాల్, డైరెక్టర్ విజేందర్‌రెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన సమావేశంలో చైర్మన్ రవీందర్, వైస్ చైర్మన్ ప్రభాకర్, కరస్పాండెంట్ మల్లారెడ్డి, తదితరులు మాట్లాడుతూ, గ్రామీణ ప్రాంత విద్యార్థులకు తక్కువ ఫీజులతో కార్పొరేట్ స్థాయిలో విద్యాబోధన చేస్తున్నామని తెలిపారు. కాలేజీలో చదివిన విద్యార్థులు ఆయా రంగాల్లో స్థిరపడ్డారని చెప్పారు. తర్వాత కాలేజీలో చదివిన పూర్వ విద్యార్థులైన డాక్టర్ దేవేందర్‌రెడ్డి(పిల్లల వైద్యుడు), సురేశ్(ఆర్థో), కానిస్టేబుల్స్‌గా ఎంపికైన గౌస్‌పాషా, సల్మాన్‌పాషా, సాయికృష్ణను ఘనంగా సన్మానించారు. ఆయా కార్యక్రమాల్లో డైరెక్టర్లు శ్రీనివాస్‌రెడ్డి, రాజేందర్, శ్రీనివాస్, అధ్యాపకులు, విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.



నృత్యం చేస్తున్న విద్యార్థినులు

## పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ

- బయోమాస్‌తో నేలకు ఆరోగ్యం.. భావితరాలకు ఉపయోగం
- ఎన్‌పీటీఐ డైరెక్టర్ సురేందర్‌కుమార్




సమావేశంలో మాట్లాడుతున్న ఎన్‌పీటీఐ డైరెక్టర్ సురేందర్‌కుమార్

జమ్మికుంట, అక్టోబర్ 13: పర్యావరణాన్ని కాపాడుకుంటేనే మానవాళి మనుగడ సాధ్యమని, అందుకు వ్యవసాయ వ్యర్థాలతో జీవఇంధనం తయారీ కేంద్రాలను నెలకొల్పుకోవాలని ఎన్‌పీటీఐ డైరెక్టర్ సురేందర్‌కుమార్(నాగ్‌పూర్) పిలుపునిచ్చారు. వ్యవసాయ వ్యర్థాల నుంచి జీవ ఇంధనం(బయోమాస్)తో నేల ఆరోగ్యం సాధ్యమని, భావి తరాలకు ఉపయోగకరమని ఆయన తెలిపారు. శుక్రవారం పట్టణంలోని కృషి విజ్ఞాన కేంద్రంలో నేషనల్ పవర్ ట్రైనింగ్ ఇనిస్టిట్యూట్, నాగ్‌పూర్ సౌజన్యంతో వ్యవసాయ వ్యర్థాల నుంచి ఇంధనం తయారీపై ఒక రోజు శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా ఎన్‌పీటీఐ డైరెక్టర్ హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, భూమిపై వ్యర్థాలు పెరిగిపోతున్నాయని, ఫలితంగా కాలుష్యం వెలువడుతున్నదని చెప్పారు. వ్యర్థాలతో బయో ఇంధనం తయారు చేసుకోవడం ఇందుకు చక్కని పరిష్కారమన్నారు. దీనివల్ల విద్యుత్ సమస్యలకు చెక్ పెట్టవచ్చని, పర్యావరణ రహిత సమాజానికి పాటుపడవచ్చని చెప్పారు. బయోమాస్ తయారీ, థర్మల్ ప్లాంటులో బయోమాస్ ఉపయోగం, వ్యవసాయ వ్యర్థాలు అమ్మకం ద్వారా వచ్చే ఆదాయం, తదితర అంశాలను వివరించారు. కార్యక్రమంలో ఎన్‌పీటీఐ డిప్యూటీ డైరెక్టర్ సంజయ్‌సింగ్, బయోమాస్ సభ్యుడు ఎండీ నిజామొద్దీన్, అధికారులు షణ్ముగమ్, శ్యామ్‌సుందర్, సంతోష్, శశిధర్, సీతారామరాజు, జిల్లా వ్యవసాయాధికారి శ్రీధర్, ఆత్మ పీడీ ప్రియదర్శిని, కేవీకే ప్రధాన కార్యదర్శి పరిపాటి విజయ్‌గోపాల్‌రెడ్డి, సీనియర్ శాస్త్రవేత్త అండ్ హెడ్ వెంకటేశ్వర్‌రావు, ఎఫ్‌పీవో రైతులు, ఇన్‌పుట్ డీలర్లు, పలు గ్రామాలకు చెందిన రైతులు, తదితరులు పాల్గొన్నారు.

## 23 మంది బైండోవర్

వీణవంక, అక్టోబర్ 13: మండలంలోని వివిధ గ్రామాలకు చెందిన 23 మంది పాత నేరస్తులను తహసీల్దార్ తిరుమల్‌రావు ఎదుట హాజరుపరిచినట్లు ఎస్ఐ ఆసిఫ్ శుక్రవారం తెలిపారు. అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ముందస్తు జాగ్రత్తల్లో భాగంగా వారిని బైండోవర్ చేసినట్లు పేర్కొన్నారు.